నేటి నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరాలు

- గాజువాక పీహెచ్‌సీలో తొలి శిబిరం
- ప్రారంభించనున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి
- రెండువేల మందికి టోకెన్లు అందజేత


పీహెచ్‌సీలో ఏర్పాట్లపై వైద్యులతో మాట్లాడుతున్న జెడ్సీ సింహాచలం

గాజువాక : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు శనివారం ప్రారంభం కానున్నాయి. మొదటి శిబిరాన్ని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి గాజువాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో ప్రారంభించనున్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కోసం రెండు వారాలుగా సర్వే బృందాలు అన్ని వార్డుల్లో ప్రజలను కలిసి, వారి యోగక్షేమాలను తెలుసుకుంటున్న విషయం తెలిసిందే. సర్వే పూర్తయిన నేపథ్యంలో ప్రతీ అర్బన్ పీహెచ్‌సీ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు మొదటి శిబిరాన్ని గాజువాక పీహెచ్‌సీలో ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 70, 71, 72 వార్డుల ప్రజలకు ప్రయోజనం చేకూరనుంది. ఈ మేరకు సర్వే సిబ్బంది రెండువేల మందికి టోకెన్లు అందజేశారు. వారిలో ప్రతిరోగికి ఉచిత వైద్యం, మందులు, వివిధ వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తారు. అవసరమైన వారిని రిఫరల్ ఆస్పత్రికి తరలించి, మరింత ఉన్నత వైద్యాన్ని ఏర్పాటు చేస్తారు.

శిబిరంలో నలుగురు వైద్య నిపుణులు

ఈ శిబిరం కోసం పీహెచ్‌సీలో సాధారణ వైద్యులతో పాటు నలుగురు స్పెషలిస్టు వైద్యులను కూడా అందుబాటులో ఉంచారు. ఈ మేరకు గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం, సహాయ ప్రజారోగ్యాధికారి డాక్టర్ ఎస్.కిరణ్ కుమార్ తదితరులు ఆస్పత్రిని పరిశీలించారు. శిబిరంలో కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున కూడా పాల్గొంటారని జెడ్సీ తెలిపారు.

జోరుగా ఆరోగ్య సురక్ష సర్వే


భరత్‌నగర్-2లో వృద్ధురాలికి బీపీ చెక్ చేస్తున్న సిబ్బంది


దువ్వాడ సెక్టార్-2లో రక్తపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కూర్మన్నపాలెం: జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే 86వ వార్డు కూర్మన్నపాలెం పరిధిలో చురుగ్గా సాగుతోంది. రాజీవ్‌నగర్, భరత్‌నగర్ 1,2తో పాటు దువ్వాడ సెక్టార్ 1,2, వెదుళ్లనరవ, డాక్‌యార్డ్ కాలనీ, మంగళపాలెం మొత్తం 7 సచివాలయాల పరిధిలో వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ ప్రజలు ఆరోగ్య వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నారు. దువ్వాడ యూపీహెచ్‌సీ పరిధిలోని వైద్యాధికారులు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, వలంటీర్లు, నర్సింగ్ విద్యార్థులు చేపడుతున్న సర్వే ను ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తూ సూచనలందిస్తున్నారు. వైద్య సిబ్బంది జగనన్న ఆరోగ్య సురక్షపై ప్రజలకు అవగాహన కలిగిస్తూ అవసరమైన చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకు అక్కడిక్కడే వైద్య పరీక్ష లు, రక్త పరీక్షలు చేస్తున్నారు.

19న శిబిరం

ఈ ప్రాంతంలో అక్టోబర్ 19న ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేసి, సర్వేలో గుర్తించిన రోగులకు చికిత్స అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని దువ్వాడ యూపీహెచ్‌సీ వైద్యాధికారి దున్న నళినీ పుష్పలత తెలిపారు. వైద్యసహాయం అవసరమైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

ఉక్కు రక్షణ యాత్రకు 'భెల్' సంఘీభావ ర్యాలీ

అక్కిరెడ్డిపాలెం: ఉక్కు పరిరక్షణ యాత్రకు మద్దతుగా భెల్ (హెచ్‌పీవీపీ) సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు సంఘీభావ బైక్ ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం సంస్థ టౌన్‌షిప్ గేటు నుంచి కార్మికులు, కార్మిక సంఘాల నాయకులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిటూ ప్రధాన కార్యదర్శి జి.టి.పి.ప్రకాష్, ఇంటక్ ప్రధాన కార్యదర్శి ఉరుకూటి బాబూరావు, విజయ్ కుమార్, సనపల జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

గాంధీ జయంతి వేళ 14,500 మొక్కలు ..

అగనంపూడి: గాంధీ జయంతిని పురస్కరించుకుని వచ్చే నెల 2వ తేదీన అగనంపూడి బీసీ కాలనీకి ఎదురుగా ఉన్న ఉక్కు భూసేకరణ విభాగం స్థలంలో 14,500 మొక్కలు నాటేందుకు సంకల్పించినట్టు లయన్స్ క్లబ్ జిల్లా చైర్ పర్సన్ కిడిమి హనుమంతురావు తెలిపారు. ఉక్కు సౌజన్యంతో, లయన్స్‌క్లబ్ సహకారంతో జపనీస్ తరహాలో చేపడుతున్న కార్యక్రమంలో పర్యావరణ ప్రియులు పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అభివృద్ధి పథంలో స్టీల్ కో-ఆపరేటివ్ స్టోర్స్

ఉక్కునగరం: కో-ఆపరేటివ్ స్టోర్స్‌లో వినూత్న మార్పులు తీసుకురావడం ద్వారా అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్తున్నామని స్టీల్‌ప్లాంట్ కోపరేటివ్ స్టోర్స్ అధ్యక్షుడు బి.టి.జగదీశ్వర రావు తెలిపారు. స్టీల్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన స్టోర్స్ మహాజన సభలో ఆయన మాట్లాడారు. 2022-23 ఏడాదికి గాను సభ్యుల షేర్ క్యాపిటల్‌పై ఆరు శాతం వడ్డీ చెల్లించేలా కమిటీ నిర్ణయం తీసుకుందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి నాగభూషణం, ఉపాధ్యక్షుడు ఆకుల నూకరాజు, కోశాధికారి రామకృష్ణ, డైరెక్టర్లు పాల్గొన్నారు.

సింహగిరిపై ఆర్జిత సేవలు పునః ప్రారంభం

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి ఆర్జిత సేవలు పునఃప్రారంభమయ్యాయి. పవిత్రోత్సవాల సందర్భంగా ఈ నెల 24 నుంచి 28 వరకు అన్ని ఆర్జిత సేవలు రద్దు చేసిన విషయం తెలిసిందే. పవిత్రోత్సవాలు ముగియడంతో తిరిగి ఆర్జిత సేవలను పునరుద్ధరించారు.

బీమా సొమ్ము అందజేత

అగనంపూడి: జీవీఎంసీ 88వ వార్డు కావుజగ్గరాజుపేటకు చెందిన జి.వెంకటలక్ష్మి అనారోగ్యంతో ఇటీవల మరణించారు. ఆమెకు వైఎస్సార్ బీమా మంజూరు కావడంతో దహన ఖర్చుల నిమిత్తం రూ.10వేల నగదును మృతురాలి కుటుంబ సభ్యులకు అందించారు. మిగిలిన రూ.90 వేలు మృతురాలి కుటుంబ సభ్యుల ఖాతాలో జమవుతాయని సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

'విజ్ఞాన్' విద్యార్థుల ఇండస్ట్రియల్ టూర్

అగనంపూడి: ఇండస్ట్రియల్ టూర్‌లో భాగంగా దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా యారాడలోని వర్కింగ్ యూనిట్లను సందర్శించారు. ముందుగా ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా, యారాడలోని రాడార్‌తో పాటు పలు కేంద్రాలను విద్యార్థులు సందర్శించి, వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ జె.సుధాకర్ ఆధ్వర్యంలో విద్యార్థులు వివిధ సంస్థలను సందర్శించారు. సీఈవో శ్రీకాంత్, ఈసీఎం విభాగాధిపతి ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్లంబర్లకు ఒక రోజు శిక్షణ

పెదగంట్యాడ: వాటర్ మేనేజ్‌మెంట్ అండ్ ప్లంబింగ్‌లో మెలకువలు తెలుసుకుని ప్లంబర్లు రాణించాలని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నాక్) అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ రవికుమార్ అన్నారు. వాటర్ మేనేజ్‌మెంట్ అండ్ ప్లంబింగ్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్ ద్వారా నాక్ ఆధ్వర్యంలో ప్లంబర్లకు శుక్రవారం ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తి ఏదైనా అందులో రాణించేందుకు ఇటువంటి శిక్షణలు ఉపకరిస్తాయన్నారు. హిండ్‌వేర్ సంస్థకు చెందిన ప్రతినిధులు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణకు వివిధ ప్రాంతాల నుంచి 35 మంది ప్లంబర్లు హాజరయ్యారు. వారందరికీ పార్టిసిపెంట్ సర్టిఫికెట్లు అందించారు.

భెల్ గేటు తెరిపించేందుకు కృషి


69వ వార్డు తుంగ్లాంలో గేటు సమస్యపై మాట్లాడుతున్న ఎంపీ జీవీఎల్

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాం వైపు గల భెల్ (హెచ్‌పీవీపీ) గేటును తెరిపించడానికి కృషి చేస్తానని రాజ్యసభ ఎంపీ జీవీఎల్ నర్సింహారావు అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డితో కలిసి భెల్ టౌన్‌షిప్ నుంచి తుంగ్లాం వైపు గల గేటు సమస్యను పరిశీలించారు. అనంతరం భారీ వర్షంలోనే తుంగ్లాం కోనేరు పక్కనున్న గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తుంగ్లాం వైపు గల భెల్ గేటు వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గేటు తెరవడానికి విశాఖపట్నం యూనిట్ భెల్ యాజమాన్యం చెబుతున్న కారణాల్లో వాస్తవం లేదన్నారు. జిల్లా యంత్రాంగం, అధికారులు తలచుకుంటే ఇది పెద్ద సమస్య కాదన్నారు. గేటు తెరిచే అంశంలో ఢిల్లీలోని కార్పొరేట్ యాజమాన్యంతో చర్చిస్తానని అన్నారు. గేటు తెరిస్తే తుంగ్లాం, కావుతుంగ్లాం, చుక్కవానిపాలెంకు చెందిన వేలాది మంది ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని కార్పొరేటర్ గోవిందరెడ్డి ఎంపీకి విన్నవించారు. ఈ అంశంలో పార్టీల కతీతంగా పనిచేస్తానని ఎంపీ తెలిపారు. కార్యక్రమంలో పలువురు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

5న బహిరంగ సభను జయప్రదం చేయాలి


పోరాట కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న సీహెచ్. నర్సింగరావు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ వ్యూహాత్మక అమ్మకానికి వ్యతిరేకంగా అక్టోబర్ 5న కూర్మన్నపాలెం వద్ద నిర్వహించనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. యాత్ర ముగింపు సందర్భంగా సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి హాజరయ్యే సభకు కార్మిక వర్గం యావత్తు హాజరు కావాలని కోరారు. స్టీల్ సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పోరాట కమిటీ సమావేశంలో నాయకులు మాట్లాడారు. స్థానిక స్టీల్ యాజమాన్యం ఏకపక్ష వైఖరికి వ్యతిరేకంగా పోరాటాన్ని ఉధృతం చేయాలని తీర్మానించారు. అంతకు ముందు హరిత విప్లవ పితామహుడు ఎం.ఎస్.స్వామినాథన్‌కు, స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు మాతృమూర్తి సీతామహాలక్ష్మి మృతికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ చైర్మన్లు డి.ఆదినారాయణ, సిహెచ్.నర్సింగరావు, నీరుకొండ రామచంద్రరావు, జె.అయోధ్యరామ్, గణపతిరెడ్డి, వరసాల శ్రీనివాస్, సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య సంరక్షణే లక్ష్యం


వలంటీర్లకు అవగాహన కల్పిస్తున్న శ్రీనివాసరావు

కూర్మన్నపాలెం: ప్రజల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో చర్యలు తీసుకుంటున్నారని 87వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పిస్తూ వడ్లపూడి, గణేష్‌నగర్-2 సచివాలయ పరిధిలోని ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లతో ఆయన శుక్రవారం సమావేశమయ్యారు. ప్రజల ముంగిటకే వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశారని చెప్పారు. అక్టోబర్ 28వ తేదీన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహిస్తారని, ఈ శిబిరంలో స్పెషలిస్ట్ డాక్టర్లు అందుబాటులో ఉండి ఉచిత వైద్య పరీక్షలతో పాటు చికిత్స చేసి, మందులు పంపిణీ చేస్తారని తెలియజేశారు. ఈ అవకాశాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో జేసీఎస్ ఇన్‌చార్జి వాడపల్లి రామచంద్రరాజు, బొడ్డ గోవిందు, ఎంఎల్‌హెచ్‌వో హేమంత్‌రెడ్డి, జెర్రిపోతుల ఈశ్వరరావు, రమేష్ జాకారియాస్, సుందరమూర్తి తదితరులు పాల్గొన్నారు.

న్యూ ఐటీఐలో ఉద్యోగ నియామకాలు


విద్యార్థులతో కార్పొరేటర్ నరసింహపాత్రుడు, హుండాయ్ కంపెనీ ప్రతినిధులు

పెదగంట్యాడ: వికాస్‌నగర్‌లోని ప్రభుత్వ న్యూ ఐటీఐలో హుండాయ్ మోటార్స్ ఇండియా లిమిటెడ్ కంపెనీ ద్వారా శిక్షణ పొందిన 23 మంది విద్యార్థులకు ఉపాధి కల్పిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. కళాశాలలో శిక్షణ పొందిన మోటారు మెకానిక్ విభాగ విద్యార్థులకు శనివారం సర్టిఫికెట్లు అందించారు. ప్రిన్సిపాల్ కె.ఎస్. శ్రీనివాసరావు అధ్యక్షతన శనివారం నిర్వహించిన కార్యక్రమంలో 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు ఐటీఐ పూర్తయిన తర్వాత ఉద్యోగాల కోసం ఎదురుచూసే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు చదువుకున్న కళాశాలలోనే ప్రాంగణ ఎంపికల ద్వారా ఉపాధి పొందే అవకాశం కలుగుతోందన్నారు. ట్రైనింగ్ ఇచ్చి ఉపాధి కల్పించిన సంస్థ ప్రతినిధులకు విద్యార్థులు, వారి తల్లితండ్రులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ట్రైనింగ్ మేనేజర్ సాయి చరణ్, లక్ష్మి హుండాయ్, మ్యాంగో హుండాయ్ ప్రతినిధులు బాలరాజు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజశేఖర్‌కు సౌత్ ఏసీపీ పరామర్శ

గాజువాక : ప్రమాదంలో గాయపడి శస్త్రచికిత్స చేయించుకున్న ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్‌ను సౌత్ ఏసీపీ టి.త్రినాథ్ శుక్రవారం పరామర్శించారు. రాజశేఖర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఏసీపీతో పాటు ఉక్కు కార్మిక నాయకులు కృష్ణారావు, గంగవరం గోపీ తదితరులున్నారు.

960వ రోజుకు 'ఉక్కు' రిలే దీక్షలు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు విషయంలో కార్మికులు రోడ్డున పడేవిధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అమానుషమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలో 960వ రోజు, శుక్రవారం సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో చేనేత, హస్తకళా ప్రదర్శన


హస్తకళా ప్రదర్శన ప్రారంభిస్తున్న కేఎస్‌ఎన్ రావు

ఉక్కునగరం: చేనేత, హస్త కళలను ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందని స్టీల్‌ప్లాంట్ గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు కె.ఎస్.ఎన్. రావు అన్నారు. భావనా రుషి చేనేత హస్త కళా కార్మిక సేవా సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన చేనేత, హస్తకళా ప్రదర్శనను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని రకాల వస్తువులు ఒకే చోట ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సేవా సంఘం నిర్వాహకులు ఎ.సింహాద్రి, బి.సురేష్ మాట్లాడుతూ ప్రదర్శనలో పోచంపల్లి, నారాయణపేట, ఉప్పాడ, చీరాల, మంగళగిరి, కలంకారి, ఫ్యాన్సీ, ఖాదీ, కాటన్ ప్రింటెడ్, బెంగాల్ సిల్క్, కాంతావర్క్ కాటన్, భాగల్‌పూర్ సిల్క్, బాంధిని సిల్క్, గుజరాత్ డిజైన్ టాప్స్ అందుబాటులో ఉంచామన్నారు. డోర్ కర్టెన్లు, డోర్ మ్యాట్లు, వరంగల్ టవల్స్ అండ్ బెడ్‌షీట్లు, రాజస్థానీ ప్రింటెడ్ టాప్స్, జైపూర్ టాప్స్, జైపూర్ బెడ్‌షీట్లు, ఖాదీ షర్ట్స్, సారంగాపూర్ వుడ్ ఐటమ్స్ ఉన్నాయని తెలిపారు. అక్టోబర్ 20 వరకు ప్రదర్శన ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కళాక్షేత్రం కార్యదర్శి డొక్క నర్సింగరావు, ప్రతినిధులు త్రినాథ్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్లకు ఆధార్ అనుసంధానం

గాజువాక : విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ మీటర్లకు ఆధార్ కార్డులను అనుసంధానం చేసుకోవాలని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.కె.నాయుడు ఒక ప్రకటనలో కోరారు. ఆధార్ అనుసంధానంతో పాటు పెండింగ్ విద్యుత్ బిల్లులను చెల్లించాలని కోరారు. ఆధార్ కార్డుల సేకరణ కోసం ఇంటింటికీ వస్తున్న సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఫొటోగ్రఫీ సొసైటీ సభ్యులకు గుర్తింపు కార్డులు

ఉక్కునగరం: వాల్తేరు ఫొటోగ్రఫీ సొసైటీ సభ్యులకు శుక్రవారం గుర్తింపు కార్డులు అందజేశారు. స్టీల్‌ప్లాంట్ కార్పొరేట్ కమ్యూనికేషన్స్ చాంబర్లో నిర్వహించిన కార్యక్రమానికి జీఎం ఆర్.పి.శర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం జరిగిన సమావేశంలో వాల్తేరు ఫొటోగ్రఫిక్ సొసైటీ ఫిబ్రవరి నెలలో నిర్వహించనున్న ఐదో అంతర్జాతీయ ఫొటో పోటీలు, ఫొటో ప్రదర్శన ను స్టీల్‌ప్లాంట్‌తో సంయుక్తంగా నిర్వహించడానికి సమ్మతించారు. పాఠశాల ల్లో, కాలేజీల్లో ఫొటో ప్రదర్శనలు, ఫొటోగ్రఫీపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్న సొసైటీ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు సేతు, శ్రీనివాసరెడ్డి, కోశాధికారి రామరాజు, స్టీల్‌ప్లాంట్ జీఎం సత్యేంద్ర, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కిమ్స్ ఐకాన్‌లో హృదయ దినోత్సవం

అక్కిరెడ్డిపాలెం: అంతర్జాతీయ హృదయ దినోత్సవాన్ని షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆస్పత్రి ఆవరణలో వైద్యులు బెలూన్లు ఎగరవేశారు. అనంతరం ఆస్పత్రిలో కేక్ కట్ చేసి హృదయ సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పించారు.

సీపీఆర్‌పై అవగాహన

అగనంపూడి: సీపీఆర్‌పై ప్రతీ ఒక్కరూ అవగాహన కల్గి ఉండాలని గొన్నా విద్యా సంస్థల చైర్మన్ పూజిత హనీష అన్నారు. 86వ వార్డు గొన్నా ఇంజనీరింగ్ కళాశాలలో వరల్డ్ హార్ట్ డే నిర్వహించారు. కార్యక్రమంలో మెడికవర్ వైద్యులు కార్డియో పల్మనరీ రెసిసిటేషన్ (సీపీఆర్)పై అవగాహన కల్పించారు. విద్యుత్ షాక్‌కు గురయ్యే సందర్భాలు, గుండెపోటు వంటి సమయాల్లో సీపీఆర్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో గొన్నా విద్యా సంస్థల ప్రతినిధులు పూర్ణ, ప్రిన్సిపాల్ మూర్తి, ఇన్‌చార్జి భారతి తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నేడు

అగనంపూడి: పెందుర్తి నియోజకవర్గ పరిధిలోని వ్యాయామ ఉపాధ్యాయులకు శనివారం స్పోర్ట్స్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించనున్నట్టు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు రౌతు నాగేశ్వరరావు, నియోజకవర్గ కో-ఆర్డినేటర్ లక్ష్మీరాణి, మండల కోఆర్డినేటర్ లోవరాజు తెలిపారు. లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న కార్యక్రమంలో పరవాడ, సబ్బవరం, పెందుర్తి మండలాల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొనాలని కోరారు.

అమరుల స్మృతి చిహ్నానికి మట్టి సేకరణ

- స్టీల్‌ప్లాంట్ సీఐఎస్ఎఫ్ అమృత్ కలశ్ యాత్ర
- 'నా మట్టి - నా దేశం' ర్యాలీ నిర్వహించిన విద్యార్థులు


మట్టి కలశాలను స్వీకరిస్తున్న స్టీల్‌ప్లాంట్ సీఐఎస్ఎఫ్ అధికారులు, సిబ్బంది


దేశ నాయకుల చిత్రపటాలు, కలశాలతో ర్యాలీ నిర్వహిస్తున్న లంకెలపాలెం హైస్కూల్ విద్యార్థులు


భారీ జెండాతో అక్కిరెడ్డిపాలెం హైస్కూల్ విద్యార్థుల ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న నడుపూరు హైస్కూల్ విద్యార్థులు

ఉక్కునగరం: దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన వీరుల జ్ఞాపకార్థం నిర్మిస్తున్న అమృత వాటిక నిర్మాణం కోసం మట్టి సేకరించి న్యూ ఢిల్లీకి పంపనున్నట్లు సీఐఎస్ఎఫ్ యూనిట్ కమాండెంట్ అత్తర్ మహ్మద్ హనీఫ్ తెలిపారు. స్టీల్‌ప్లాంట్ సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం 'నా మట్టి నా దేశం' పేరిట అమృత కలశ్ యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా స్టీల్‌ప్లాంట్ సీఐఎస్ఎఫ్ యూనిట్ ఆధ్వర్యంలో 77వ వార్డు మురుభాయ్ గ్రామంలో గ్రామస్తుల నుంచి మట్టి కలశాలను సేకరించారు. ఈ సందర్భంగా దేశభక్తి గీతాలను ఆలపించారు. ఉప కమాండెంట్ నవీన్‌కుమార్, సహాయ కమాండెంట్ పి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ నాయకుల చిత్రపటాల ప్రదర్శన

అగనంపూడి: 'నా మట్టి-నా దేశం' కార్యక్రమంలో భాగంగా లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కుండల్లో మట్టిని సేకరించారు. అనంతరం కలశాలు, జాతీయ నాయకులు చిత్రపటాలతో ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు మాట్లాడుతూ దేశం కోసం పోరాడిన జాతీయ నాయకులను స్మరించుకునేలా కార్యక్రమం చేపట్టామన్నారు. పాఠశాల కమిటీ ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జెండాతో విద్యార్థుల ర్యాలీ

అక్కిరెడ్డిపాలెం: భారతదేశ ఔన్నత్యాన్ని, ఐక్యతను చాటుతూ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు నా మట్టి-నా దేశం నినాదంతో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. భారీ జాతీయ జెండాను ప్రదర్శిస్తూ, నినాదా లతో గ్రామంలో ఈ ర్యాలీ సాగింది. హెచ్‌ఎం ఎం. ఎల్.ఎస్.కాంతం మాట్లాడుతూ విద్యార్థుల్లో సమైక్యత భావాన్ని పెంపొందించేలా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అవసరం అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నడుపూరు విద్యార్థుల ర్యాలీ

పెదగంట్యాడ: నా మట్టి-నా దేశం కార్యక్రమంలో భాగంగా నడుపూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం ర్యాలీని ప్రారంభించారు. విద్యార్థులు కలశాల్లో మట్టి సేకరించి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాచకొండ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ.38 లక్షల ఆస్తిపన్ను వసూలు


జెడ్సీకి చెక్కులు అందజేస్తున్న రెవెన్యూ అధికారులు

గాజువాక : జీవీఎంసీ రెవెన్యూ విభాగం అధికారులు శుక్రవారం రూ.38 లక్షల ఆస్తిపన్నులను వసూలు చేశారు. గాజువాక ఆటోనగర్‌లోని స్టీల్‌ప్లాంట్ క్వార్టర్లకు సంబంధించి రూ.32 లక్షలు, ఎంవీవీ బిల్డర్ల నుంచి రూ.6 లక్షల పన్నును రెవెన్యూ అధికారి సీహెచ్.రామనారాయణ, ఆర్ఐలు సయ్యద్ సుభాన్, రెడ్డి మోహన్ వసూలు చేశారు. వారు ఆ చెక్కులను గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలంకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన వారిని అభినందించారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

ఉక్కునగరం: షాపులకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా నేరాలు నియంత్రించవచ్చని గాజువాక క్రైం సీఐ పి.సూర్యనారాయణ అన్నారు. స్టీల్‌ప్లాంట్ సెక్టార్-2 కాంప్లెక్స్‌లో ఉక్కునగరంలోని వర్తకులకు శుక్రవారం సీసీ కెమెరాలపై అవగాహన కల్పించారు. ఒక కెమెరా 10 మంది పోలీసులతో సమానమన్నారు. కెమెరాలను ఏర్పాటు చేయడం వల్ల నేరస్తులను పట్టుకోవడం సులభమవుతుందన్నారు. తద్వారా పోలీసు శాఖకు సహకరించిన వారు అవుతారన్నారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ క్రైం ఎస్ఐ ఎల్. శ్రీనివాసరావు, ఎస్ఐ స్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.